బడిబాటకు అనూహ్య స్పందన

సర్కారు బడిలో చేర్పించేందుకు తల్లిదండ్రుల ఆసక్తి

- 407 ప్రభుత్వ పాఠశాలల్లో 9,037 మంది విద్యార్థుల చేరిక
- ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోకి 4,691 మంది..
- వచ్చేనెల 6 వరకు బడిబాట కార్యక్రమం పొడిగింపు
- కరోనా నేర్పిన కష్టకాలంతో మారిన తల్లిదండ్రుల వైఖరి
- ప్రభుత్వ బడుల్లో అన్ని సౌకర్యాలు ఉండటంతోనే..



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ పాఠశాలలకు ఆదరణ పెరుగుతోంది. కరోనా కష్టకాలం నుంచి పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన తల్లిదండ్రుల ఆలోచనా విధానంలో మార్పు వచ్చింది. ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజులు చెల్లించడం తల్లిదండ్రులకు తలకు మించిన భారం కావడంతో ప్రభుత్వ పాఠశాల వైపు మొగ్గు చూపుతున్నారు. దీనికి మించి ప్రభుత్వ బడుల అభివృద్ధి కోసం తెలంగాణ సర్కారు తీసుకుంటున్న చర్యలు కూడా విద్యార్థుల తల్లిదండ్రుల చూపు ప్రభుత్వ పాఠశాలల వైపు వెళ్లేలా చేస్తోంది. అందులో భాగంగానే సర్కారు బడులకు గతంలో ఎన్నడూ లేని విధంగా ఆదరణ లభిస్తోంది. కోవిడ్–19 వైరస్ సృష్టించిన ఆర్థిక ఇబ్బందులు, నేర్పిన పాఠాలు పేద, మధ్యతరగతి కుటుంబాల తల్లిదండ్రుల్లో పెను మార్పు తీసుకు వచ్చినట్లు తెలుస్తోంది. పైగా ప్రైవేట్ స్కూళ్లు ముఖ్యంగా కార్పొరేట్ పాఠశాలల్లో ఏడాదికి ఏడాది పెంచుతున్న అధిక ఫీజులను కూడా చెల్లించలేక చాలా మంది తల్లిదండ్రులు మారిన పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పిస్తున్నారు.

6వ తేదీ వరకు పొడగింపు

మేడ్చల్–మల్కాజిగిరిలో బడిబాట కార్యక్రమానికి అనూహ్య స్పందన లభిస్తోంది. ఈ నెల 3 నుంచి 9 వరకు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల(విద్యార్థుల) పేర్ల నమోదు కార్యక్రమాన్ని చేపట్టిన విద్యాశాఖ 12 నుంచి 19వతేదీ వరకు బడిబాట కార్యక్రమాన్ని విద్యాశాఖ ఆర్భాటంగా, పెద్దఎత్తున చేపట్టింది. దీంతో బడిబాట కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. ఈ నేపథ్యంలోనే బడిబాటను వచ్చే నెల 6వ తేదీ వరకు పాఠశాల విద్యాశాఖ పొడిగించింది. జిల్లా విద్యాశాఖ నిర్వహించిన బడి బాట కార్యక్రమంలో ఇప్పటి వరకు మేడ్చల్ జిల్లాలో 9,037 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. ఇందులో ప్రైవేట్ స్కూళ్ల నుంచి 4,691 మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరడం రికార్డుగా జిల్లా విద్యాశాఖ పేర్కొంటోంది.

ప్రభుత్వ బడులపై ఆదరణ పెరిగిందిలా..

మేడ్చల్ జిల్లాలో విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలకు తగ్గట్టుగా అన్ని స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారు. అలాగే.. మనబడి–మన ఊరు–మన బస్తీ కార్యక్రమం కింద మొదటి విడతలో 176 ప్రభుత్వ బడుల్లో రూ.70 కోట్లతో మరమ్మతులు, మౌలిక వసతుల కల్పన వంటి చర్యలకు శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు 35 పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతుండటంతో పాటు విద్యార్థులకు ఏకరూప దుస్తులు, ఉచిత పుస్తకాల పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం వంటి సదుపాయాలను కల్పిస్తున్న అంశాలను బడిబాటలో జిల్లా విద్యాశాఖ విస్తృతంగా ప్రచారం చేస్తోంది. ఫలితంగా బడిబాటకు అనూహ్య స్పందన లభిస్తోంది.

కరోనా నేర్పిన కష్టకాలం నుంచి..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో కరోనా కష్టకాలంలో భాగంగా 2021–22 విద్యాసంవత్సరంలో 515 ప్రభుత్వ పాఠశాలల్లో 9,718 మంది విద్యార్థులు చేరగా, ఇందులో ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 3,408 మంది ఉన్నారు. అలాగే.. 2022–23లో జిల్లాలో కొత్తగా ప్రభుత్వ పాఠశాలల్లో 793 మంది విద్యార్థులు చేరగా, ఇందులో ప్రైవేట్ విద్యా సంస్థల నుంచి వచ్చి చేరిన విద్యార్థులు 339 మంది ఉన్నారు.

మండలాల వారీగా ఇలా..

జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తంగా 4,691 మంది విద్యార్థులు చేరగా, ఇందులో మండలాల వారీగా చేరిన విద్యార్థుల సంఖ్య ఈ విధంగా ఉంది. మేడ్చల్ మండలంలో 232 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ బడుల్లో చేరగా, దుండిగల్ మండలంలో 288, బాచుపల్లిలో 197, కుత్బుల్లాపూర్‌లో 448, కూకట్‌పల్లిలో 501,

- బాలానగర్‌లో 215, అల్వాల్‌లో 285, మల్కాజిగిరిలో 273, ఉప్పల్‌లో 694, మేడిపల్లిలో 140, కాప్రాలో 461, శామీర్‌పేటలో 141, కీసరలో 327, ఘట్‌కేసర్‌లో 439, మూడుచింతలపల్లిలో 50 విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ స్కూళ్లలో చేరారు.

క్లుప్తంగా...

దివ్యాంగుల పాఠశాలలో నర్సరీ యూనిట్ ప్రారంభం

మల్లాపూర్: నాచారం సాధన మానసిక దివ్యాంగుల పాఠశాలలో ఇన్ క్రెడిబుల్ సభ్యులు వృత్తి విద్యా శిక్షణలో భాగంగా మంగళవారం నర్సరీని ఏర్పాటు చేశారు. యూనిట్‌ను గౌతమ్‌నగర్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మీ ప్రారంభించారు. అనంతరం దివ్యాంగులైన విద్యార్థులకు మొక్కలు, నర్సరీ ఉపయోగాలను ఇన్‌క్రెడిబుల్ సభ్యులు వివరించారు. అనంతరం సాధన పాఠశాలకు 8 డెస్క్ బెంచీలు, 4 ఫ్యాన్లు, 4 బ్లాక్ బోర్డులు, ఒక కుక్కర్‌ను అందజేశారు. ఇన్‌క్రెడిబుల్‌కో ఆర్డినేటర్ జయంతి, సాధన సెక్రటరీ మధుసూదన్‌రెడ్డి, వ్యవస్థాపకురాలు సురేఖారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నియామకం



బుదాని సదానందంకు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న నల్లా రాధాకృష్ణ

మల్లాపూర్: తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ(టీయూ జేఏసీ) ఉప్పల్ నియోజకవర్గం కన్వీనర్‌గా నాచారం అన్నపూర్ణ కాలనీకి చెందిన బుదాని సదానందం నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం నాచారంలోని బహుజన సాహిత్య అకాడమీ కార్యాలయంలో కో ఆర్డినేటర్ కసుకుంట్ల విజయ్‌కుమార్ అధ్యక్షతన ఉప్పల్ నియోజకవర్గ టీయూ జేఏసీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. బుదాని సదానందంను కన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నల్లా రాధాకృష్ణ, నందికొండ శ్రీనివాస్‌రెడ్డి, సంజీవ, స్వాతి, శ్యామల, మోహన్, బాల్‌రాజ్, సతీష్, లింగస్వామి పాల్గొన్నారు.

పది రోజుల్లో సత్యానగర్‌కు తాగునీరు



సత్యానగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని సత్యానగర్‌లో ఇటీవల వేసిన తాగునీటి పైప్‌లైన్లను మంగళవారం కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్తగా వేసిన తాగునీటి పైప్‌లైన్ నుంచి ట్రయల్ రన్ నిర్వహించిన అనంతరం పది రోజుల్లో జంక్షన్లు ఏర్పాటు చేసి నీటిని అందిస్తామని అన్నారు. ఎక్కడ ఫిర్యాదులు అందినా వెంటనే మరమ్మతులు చేసి పరిస్థితులు చక్కదిద్దాలన్నారు. జలమండలి మేనేజర్ రవీందర్, కిషన్, నగేష్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న లక్ష్య ఫౌండేషన్ ప్రతినిధులు

కుషాయిగూడ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు లక్ష్య ఫౌండేషన్ ప్రతినిధులు మంగళవారం నోట్‌బుక్స్, పెన్సిల్స్, పెన్స్ తదితర స్టేషనరీ పంపిణీ చేశారు. నెహ్రూనగర్, లక్ష్మీనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందజేశారు. ఫౌండర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ సేవ చేయాలనే సంకల్పంతోనే సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. వి.తారాసింగ్, ఎస్.వెంకటేశ్వర్లు, షీలా, హేమంతో పాటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కిషన్, అంజిరెడ్డి పాల్గొన్నారు.

న్యూసెన్స్ కేసులో జైలు, జరిమానా

మల్కాజిగిరి: న్యూసెన్స్ చేసిన ఓ యువకుడికి జైలుశిక్ష, జరిమానా విధించారు. మల్కాజిగిరి ఇన్‌స్పెక్టర్ రవికుమార్ వివరాల ప్రకారం.. ఓల్డ్ సఫిల్‌గూడకు చెందిన విజయ్‌కాంత్(27) ఆటో డ్రైవర్. ఇటీవల పబ్లిక్ ప్లేస్‌లో న్యూసెన్స్ చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం ఐదో మెట్రోపాలిటన్ మల్కాజిగిరిలో హాజరుపర్చగా మూడు రోజుల జైలు, రూ.వెయ్యి జరిమానా విధించింది.

విద్యార్థులు క్రియాశీల పాత్ర పోషించాలి



మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

బోడుప్పల్: విద్యార్థులు ప్రపంచంలో జరిగిన అనేక ఉద్యమాల్లో క్రియాశీల పాత్ర పోషించి రాజకీయంగా ఎదిగారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్‌లోని బొమ్మక్ ఆర్ కన్వెన్షన్‌లో మంగళవారం జరిగిన రెండో రోజు ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక, సైద్ధాంతిక రాజకీయ శిక్షణ తరగతుల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి రాజకీయాలు – నాయకత్వ లక్షణాలు అనే అంశంపై విద్యార్థులకు బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల బలిదానాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకొని సమాజానికి ఉపయోగపడే విధంగా ఎదగాలన్నారు. విద్యార్థి దశలో వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో విద్యార్థులు అగ్రభాగాన ఉండి పోరాడారన్నారు. నేడు విద్య వ్యాపారంగా మారిందని, విద్య కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ జరిగి సామాన్యులకు విద్య అందని ద్రాక్షలా మారిందన్నారు. ఉన్నత విద్యలో సైతం ప్రైవేట్ విద్యాలయాలు వచ్చాయని, వాటికి వ్యతిరేకంగా పోరాడాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. విద్యార్థులు రాజకీయాలకు దూరంగా ఉండకుండా రాజకీయంగా ఎదగడం ద్వారానే మెరుగైన సమాజాన్ని ఏర్పాటు చేయడం సాధ్యమన్నారు. కార్యక్రమంలో మణికంఠరెడ్డి, గ్యార క్రాంతి, నాగజ్యోతి, రమేష్, ఎస్‌ఏ స్టాలిన్, పుట్ట లక్ష్మణ్, రామకృష్ణ, రెహమాన్, రఘురాం విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడల్లో యువత రాణించాలి



యువతకు కిట్లను అందజేస్తున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: యువత క్రీడల్లో రాణించాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ తరఫున క్రీడా కిట్లను మల్లాపూర్ వార్డు కార్యాలయం వద్ద యువతకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం, జీహెచ్‌ఎంసీ యువతకు క్రీడా పోటీలు నిర్వహించి ప్రోత్సహిస్తోందని అన్నారు. పీఆర్.ప్రవీణ్, సీహెచ్.శ్రీకాంత్, రామాంజనేయులు, రాము, మురళి, నర్సింగ్‌రావు, తునికి నరేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం

మల్లాపూర్: డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్, అశోక్‌నగర్ సమస్యలు పరిష్కరించడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తిగా విఫలమయ్యారని కాంగ్రెస్ ఉప్పల్ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి ఎద్దేవా చేశారు. నెహ్రూనగర్, అశోక్‌నగర్‌బస్తీ సమస్యలపై రాగిడి లక్ష్మారెడ్డి మంగళవారం పాదయాత్ర చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, ఇళ్ల మధ్య డ్రైనేజీ పొంగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వృద్ధాప్య పింఛన్లు, రేషన్‌కార్డులు, కలుషిత నీటి సరఫరాను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో



సమస్యలను రాగిడి లక్ష్మారెడ్డికి వివరిస్తున్న కాలనీవాసులు

టీపీసీసీ మైనార్టీ జనరల్ సెక్రటరీ సంజయ్ జైన్, వంగేటి సంజీవరెడ్డి, మొసలి శ్రీనివాస్‌రెడ్డి, పీజీ సుదర్శన్, బొంగోని ఉమేష్‌గౌడ్, నెమలి అనిల్, గట్టయ్య, స్టార్‌రెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు తప్పవు



కార్తికేయనగర్ జీహెచ్‌ఎంసీ స్థలంలో బోర్డును ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

మల్లాపూర్: నాచారం కార్తికేయ నగర్‌లోని సర్వే నెంబర్ 233, 249, 254లోని జీహెచ్‌ఎంసీ చెందిన ఖాళీ స్థలంలో కొంత మంది ప్రైవేట్ వ్యక్తులు ఇది తమ స్థలం అంటూ గోడలపై రాసిన రాతలను జీహెచ్‌ఎంసీ సిబ్బంది మంగళవారం చెరిపివేశారు. ఈ స్థలం వివాదంలో కోర్టు ఉంది, గౌరవ కోర్టు తీర్పు ఇచ్చేంత వరకు ఎవరైనా స్థలాన్ని ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కాప్రా డీసీ శంకర్ తెలిపారు.

లో ప్రెషర్ సమస్యకు పరిష్కారం



నీటి కనెక్షన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో నెలకొన్న తాగునీటి లో ప్రెషర్ సమస్యకు కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పరిష్కారం చూపారు. శుభోదయ కాలనీ, సోనియాగాంధీనగర్, గణేష్‌నగర్ కాలనీల్లో నీటి లో ప్రెషర్ సమస్యపై కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె జలమండలి అధికారులతో కలిసి మంగళవారం ఆయా కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా అధికారులకు సమస్యను వివరించారు. మెయిన్ జంక్షన్ నుంచి కొత్త కనెక్షన్‌ను ఇప్పిస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందని, అధికారులు తక్షణమే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. దీంతో కాలనీల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. జలమండలి ఏఈ రోహిత్, స్థానిక నేతలు నాగిళ్ల బాల్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, సురేష్‌రెడ్డి, పలుగు రమణయ్య, పలుగుల శ్రీనివాస్, సాయిబాబాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కమాన్‌ను పునర్నిర్మించాలి

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ క్రాస్ రోడ్డు వద్ద తమ తండ్రి, అమ్మగారి జ్ఞాపకార్థం 30 ఏళ్ల క్రితం కమాన్ నిర్మించామని, మూడేళ్ల క్రితం మున్సిపల్ అధికారులు కూల్చేశారని, ఆ సమయంలో అప్పటి కమిషనర్ శ్రీనివాస్ వచ్చి రూ.10 లక్షలతో నిర్మిస్తామని హామీ ఇచ్చారని దర్గ రాంరెడ్డి కూతురు కొండల భాగ్యమ్మ, నిర్మాణదాత మనవడు కొండల విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఇప్పటికైనా స్పందించి కమాన్ నిర్మించాలని మంగళవారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వంశీకృష్ణకు వినతి పత్రం అందజేశారు.



మేమున్నామని..

మల్కాజిగిరి: మల్కాజిగిరి విష్ణుపురికాలనీలోని తేజశ్రీ డిసేబుల్డ్ సొసైటీ ఫర్ హోమ్ ఫర్ బ్లైండ్‌కు ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ చేయూత అందించింది. హైదరాబాద్ సర్కిల్ జనరల్ సెక్రటరీ ఆర్.శ్రీరామ్ నిత్యావసర సరుకులు, యూనియన్ తరఫున రూ.40 వేల విలువజేసే వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19వ వార్షికోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్.ప్రసాద్, ఉత్తమ్ భరద్వాజ్, నాగ భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



అర్హులు సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కు అందజేస్తున్న మేయర్ బుచ్చిరెడ్డి

బోడుప్పల్: నగర పాలక సంస్థలోని ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే రాజేష్ నానమ్మ కమలమ్మకు హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.లక్ష చెక్కు మంజూరు కాగా మంగళవారం బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి చేతులమీదుగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని, వాటిని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కాటపల్లి రాంచంద్రారెడ్డి, చంటి శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది మహిపాల్, రాజేష్, సతీష్ పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



క్యాబినెట్ ఎలక్షన్‌లో పాల్గొన్న విద్యార్థులు

బోడుప్పల్: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన స్కూల్ క్యాబినెట్ ఎలక్షన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే లీడర్‌షిప్ క్వాలిటీస్‌ను అలవర్చుకోవాలన్నారు. ఓటు హక్కు గురించి, ఓటు విలువను గురించి విద్యార్థులకు వివరించారు. క్యాబినెట్ ఎలక్షన్‌లో స్కూల్ పీపుల్ లీడర్, డిప్యూటీ స్కూల్ పీపుల్ లీడర్, హౌస్ క్యాప్టెన్, వైస్ క్యాప్టెన్‌ను ఎన్నుకున్నట్లు వెల్లడించారు. ప్రధాన మంత్రి మోదీ ప్రారంభించిన స్వచ్ఛ భారత్‌ను ఆదర్శంగా తీసుకుని స్కూల్ పరిసర ప్రాంతాలను ఎంతో పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. దీని కోసం ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రూ.6 వేల పెన్షన్ ఇవ్వాలి



అల్వాల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దివ్యాంగులు

అల్వాల్: వికలాంగులకు ఇచ్చే రూ.3,016 పెన్షన్‌ను రూ.6 వేలకు పెంచాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ఎస్.వినయ్ డిమాండ్ చేశారు. మంద కృష్ణ మాదిగ పిలుపుమేరకు మంగళవారం అల్వాల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 శాతం డబుల్ ఇళ్లు మంజూరు చేయాలని, వికలాంగుల బంధు ఇవ్వాలన్నారు. రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రుణాలను మంజూరు చేయాలన్నారు. అనంతరం అల్వాల్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో విశ్వరూపచారి, షబానా, ఆర్.మల్లేష్, కళావతి, శోభ, పత్రాజ్, మధుసూదన్‌రెడ్డి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వైద్య సేవలు అభినందనీయం



పేదలను తీసుకెళ్లేందుకు ఏర్పాటు చేసిన మల్లారెడ్డి హాస్పిటల్ బస్సు

బోడుప్పల్: మల్లారెడ్డి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని బోడుప్పల్ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్ అన్నారు. మల్లారెడ్డి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం సూరారంలోని మల్లారెడ్డి హాస్పిటల్ నుంచి బస్సును ఏర్పాటు చేసి చెంగిచర్ల 2వ డివిజన్ పరిధిలోని పలువురు పేదలకు ఉచిత కంటి పరీక్షలు, ఆపరేషన్ కోసం వారిని తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలందరికీ అన్ని రకాల వైద్య సేవలు అందాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కొత్త రవిగౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

కంటి వెలుగు సిబ్బందికి జీతాలివ్వండి

అల్వాల్: కంటి వెలుగులో పని చేసిన సిబ్బంది(పీఎంఓఏ)లకు తక్షణమే జీతాలు చెల్లించాలని పీఎంఓఏ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మిడతనపల్లి సురేష్ పేర్కొన్నారు. మంగళవారం అల్వాల్‌లో ఆయన మాట్లాడుతూ కంటి వెలుగు నేత్ర వైద్య సహాయకులను కంటి వెలుగు ముగియగానే మధ్యలో గాలికి వదిలి వేయకుండా పూర్తిస్థాయిలో వారి సేవలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కొనసాగించాలని కోరారు. జూన్ నెల చివరి దశకు వచ్చేసరికి ఇప్పటికీ మే నెల జీతాలు ఇంకా ఇవ్వలేదన్నారు. మే, జూన్ నెల జీతాలు తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సిబ్బందితో వెట్టిచాకిరీ చేయించుకొని సమయానికి కనీసం చెల్లించే జీతాలు కూడా చెల్లించకుండా సిబ్బందిని తీవ్రమైన అవమానాలకు, ఆందోళనకు గురి చేస్తున్నారన్నారు. ప్రతినెలా ఇదే రీతిలో జీతాలు సమయానికి చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పూర్తిస్థాయిలో కంటి వెలుగును నమ్ముకొని వచ్చి పనిచేస్తున్న తమకు ఇంటి కిరాయి, పాల బిల్లు, కిరాణం సరుకులు, పిల్లల స్కూల్ ఫీజులు ఎలా చెల్లించాలని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులను ఎన్నిసార్లు అడిగినా స్పందన లేదని రేపు, మాపు అంటూ మభ్య పెడుతున్నారన్నారు. వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్‌ను పలుమార్లు కలిసి సమయానికి జీతాలు ఇవ్వాలని కోరామన్నారు. అయినా స్పందన లేదన్నారు. ఇప్పటికైనా స్పందించాలని కోరారు.

మురుగు సమస్య తలెత్తకుండా చర్యలు



కిష్టమ్మ ఎన్‌క్లేవ్‌లో మురుగు సమస్య పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి

అల్వాల్: అల్వాల్ డివిజన్‌లో మురుగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని స్థానిక కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని కిష్టమ్మ ఎన్‌క్లేవ్‌లో ఆమె జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీలో మురుగు పారుతోందని గుర్తించి సమస్య పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఈ ప్రశాంతి, జలమండలి మేనేజర్ రమేష్, చందు, శేఖర్, సతీష్, కవిత, నాగేశ్వర్‌రావు, అరవింద్, అశ్విన్ తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్యం మెరుగు పర్చండి

అల్వాల్ డివిజన్‌లో పారిశుద్ధ్యం మెరుగు పర్చాలని కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం తన కార్యాలయంలో అధికారుతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతిరోజూ ఇంటి నుంచి చెత్తను సేకరించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంహెచ్ఓ మంజుల, పారిశుద్ధ్య అధికారితో పాటు రాంకీ సిబ్బంది నర్సింహ, జవాన్లు తదితరులు ఉన్నారు.



నటరాజుకు నృత్యాంజలి

లక్డీకాపూల్: ఉప్పల్ శిల్పారామంలో నాట్యగురువు డాక్టర్ నటరాజ రామకృష్ణ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నృత్యజ్యోతి నాట్యశిక్షణాలయానికి చెందిన డా.పేరిణికుమార్ శిష్యులు 32మంది ఆంధ్రనాట్యంలోని వివిధ అంశాలతో నటరాజుకు నృత్యాంజలిగా ప్రదర్శించారు. కూచిపూడి ప్రసిద్ధ నర్తకీమణి డా.దేవులపల్లి ఉమ ముఖ్య అతిథిగా విచ్చేసి చిన్నారులకు ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా గురు పేరిణికుమార్‌ను నూతన వస్త్రాలతో సన్మానించారు.

రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలి

కాప్రా: రక్తదానం సామాజిక బాధ్యత అని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కుషాయిగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ చంద్రకాంత్ అన్నారు. టీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన రక్తదాన శిబిరాల్లో భాగంగా మంగళవారం ఈసీఐఎల్ బస్ టెర్మినల్‌లో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ సిబ్బంది, కార్మికులు పాల్గొని దాదాపు 40 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు చంద్రకాంత్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని రక్షించినవారమవుతామన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి డిపో మేనేజర్ చంద్రకాంత్ ప్రశంస పత్రాలు అందించారు.